క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఖమ్మం డివిజన్ విద్యుత్ ఆపరేషన్స్ డీఈ నంబూరి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఐడీఏ పరిధిలోని పాండురంగాపురం, జయనగర్ కాలనీ, కైకొండాయిగూడెం, ఐడీఏ, ప్రశాంతినగర్, బాలపేట, 33/11 కేవీ సబ్ స్టేషన్ రఘునాథపాలెం పరిధిలోని రఘునాథపాలెం, కోయచెలక, రేగులచెలక, శివాయిగూడెం, పువ్వాడ ఉదయ్‌నగర్, 33/11 కేవీ సబ్‌స్టేషన్ కోటపాడు పరిధిలో కోటపాడు, చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

కరపత్రాలు పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: రజక వృత్తిదారుల సదస్సును జయప్రదం చేయాలని మాజీ కౌన్సిలర్, సమైఖ్య రజక సంఘం జిల్లా సీనియర్ నాయకుడు జక్కుల లక్ష్మయ్య కోరారు. గురువారం టూటౌన్ పరిధిలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో నేడు(శుక్రవారం) సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సదస్సుకు అధిక సంఖ్యలో రజకులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కుల వెంకటరమణ, లాండ్రి షాపుల సంఘం కన్వీనర్ పంతంగి రవికుమార్, వెంకట్, జక్కుల సత్యనారాయణ, బాలరాజు, శ్రీనివాసరావు, వంశీ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ రుణాలు ఇవ్వాలి



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ కార్పొరేషన్ పెండింగ్ దరఖాస్తుదారులందరికీ రుణాలు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు సమస్యలపై బీసీ కార్పొరేషన్ ఏఓ మాధవికి వినతి పత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే బీసీల రుణాలు గుర్తుకొస్తాయని, దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు అందేలా చూడాలని కోరారు. వినతి అందించిన వారిలో పోతగాని రమణకుమార్, వెంకటరామయ్య, మహేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ బచ్చలకూరి నిర్మల ఆధ్వర్యాన గురువారం అటరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించేందుకు అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం ద్వారా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కేంద్రాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నియామకం

నేలకొండపల్లి: టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని బైరవునిపల్లికి చెందిన నూక హన్మంతరావు ఎంపికయ్యారు. ఈమేరకు టీటీడీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హన్మంతరావు పేర్కొనగా, ఆయనను పావులూరి వెంకటేశ్వరరావు, ఆరెకట్ల కొండలరావు, మల్లయ్య, తీగ వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

చేరికలు

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని కొత్త తండా (కొబ్బరిచెట్టుతండా) గ్రామానికి చెందిన 100 కుటుంబాలు బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ పార్టీలకు రాజీనామా చేసి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యలకు మద్దతుగా గురువారం రాజీనామా చేసినట్లు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ తెలిపారు. రాజీనామా చేసిన వారిలో ముత్తబోయిన రామ్మూర్తి యాదవ్, గుగ్గిళ్ల రవి, దాసరి సైదులు, అమరబోయిన గురవయ్య, సాతునూరి నాగయ్య, గంటా సాంబయ్య తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

వినోద	టక్కర్
సాయిరాం	ట్రాన్స్‌ఫార్మర్స్
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	అన్‌స్టాపబుల్
సుందర్	విమానం

- ఖమ్మంగాంధీచౌక్

‘సర్కారు’లో జోష్..!

సత్ఫలితాలు ఇస్తున్న ‘బడిబాట’

- ముమ్మరంగా ఇంటింటా ప్రచారం
- నానాటికీ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- ప్రభుత్వ పాఠశాలల వైపే తల్లిదండ్రుల మొగ్గు
- ప్రవేశాల పెరుగుదలతో ఉపాధ్యాయుల్లో నూతనోత్సాహం



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం

సర్కారు విద్య బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మన ఊరు– మన బడి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆంగ్ల మాధ్యమం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత యూనిఫాం తదితర అంశాలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు దోహదపడుతున్నాయి. గతంలో ప్రైవేటు పాఠశాలల వైపే మొగ్గుచూపే తల్లిదండ్రులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల వైపు ఆసక్తి కనబరుస్తున్నట్లుగా ఉపాధ్యాయులు చెప్తున్నారు. రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో ఉపాధ్యాయుల్లో సైతం జోష్ కలుగుతోంది. ఖమ్మం నగరంలో సర్కారు బడుల్లోని ప్రవేశాలకు సంబంధించి పూర్తి వివరాలతో ‘సాక్షి’కథనం..

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఖమ్మం నగరంలో విశేష స్పందన లభిస్తుంది. ఖమ్మం అర్బన్ మండలంలో 77 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఈ నెల 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుండగా.. 3 నుంచి 7వ తేదీ వరకు రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యార్థుల ప్రవేశాల పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయగా 1,654మంది విద్యార్థులు చేరారు. ఈ క్రమంలో పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రవేశాల సంఖ్య పెరుగుతున్నట్లుగా ఉపాధ్యాయులు చెప్తున్నారు.

ప్రైవేట్ వీడి.. సర్కారులో చేరి..

ఖమ్మం నగరంలో ఉన్న 77 పాఠశాలల పరిధిలో 1వ తరగతి ప్రవేశానికి 238 మంది చేరగా.. వీరిలో ప్రైవేట్ పాఠశాలల నుంచి 25మంది ఉన్నారు. అలాగే 2 నుంచి 10వ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలల నుంచి 420 మంది చేరగా.. అందులో 5 నుంచి 6వ తరగతిలోకి ప్రవేశం పొందే వారు 1,060 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను చూసి ఆకర్షితులై చేరుతున్నట్లుగా అధికార యంత్రాంగం చెబుతోంది.



ఎస్సెస్సీ కాలనీ పాఠశాల ఆధ్వర్యంలో ప్రచారం..

స్పందన వస్తోంది..



బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలు ఉంటుండగా.. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. గతంలో కంటే విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూస్తున్నాం.

– ఎం.శ్రీనివాస్, ఎంఈఓ, ఖమ్మం అర్బన్

పాపటపల్లిలో బడిబాట..

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లిలో గురువారం బడి బాట ర్యాలీ, విద్యార్థుల పేర్లు నమోదు కార్యక్రమాన్ని ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బడి ఈడు పిల్లలను బడికి పంపాలని, ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను వినియోగించుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నబోయిన ముత్తమ్మ, హెచ్‌ఎంలు హెచ్.రంగారావు, శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీతీశారు.



విద్యార్థిని పేరు నమోదు చేస్తున్న ఎంఈఓ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా

తిరుమలాయపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ మాలతితో కలిసి ప్రారంభించాక, ఆ తర్వాత తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సొంత మండలమైన తిరుమలాయపాలెంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపి ఆస్పత్రిలో ఇంకా కావాల్సిన సదుపాయాలపై నివేదిక అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాంబాబు, పీహెచ్‌సీ డాక్టర్ రామారావు, తహసీల్దార్ పుల్లయ్య, సొసైటీ చైర్మన్ చావా వేణు, వైస్ చైర్మన్ చామకూరి రాజు, సర్పంచ్‌లు నామా ప్రసాద్, కొండబాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.40లక్షలు విరాళం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చరణలమధ్య ఈ క్రతువును నిర్వహించగా గ్రామస్తులతో పాటు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడి నిర్మాణానికి రూ.40లక్షలు విరాళం ప్రకటించారు. ఆయనతో పాటు ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



సంథామినిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహించిన బాలికల గణిత మేధా టాలెంట్ టెస్టులో తమ విద్యార్థిని అగ్రస్థానంలో నిలిచినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలలో గురువారం వారు మాట్లాడుతూ ఫ్లోరిడా ఇంటిలిజెంట్ గర్ల్స్ స్ప్రింగ్ ఆధ్వర్యాన పోటీలు నిర్వహించగా 13నుంచి 18 ఏళ్ల విభాగంలో ఎస్.సంథామిని ప్రతిభ కనబర్చిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌తో పాటు ఐఐటీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరరావు అభినందించారు.

11న నగరస్థాయి టీ.టీ. పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నగరస్థాయి టేబుల్ టెన్నిస్(టీ.టీ.) పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి డాక్టర్ అనుమోలు అప్పారావు, శ్రుతిలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి క్రీడా శిబిరాల్లో పాల్గొన్న క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేయబడతాయని, పూర్తి వివరాలకు 98484 08335 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీసీ బంధు ఇవ్వాలి

ఖమ్మంరూరల్: ప్రభుత్వం బీసీలకు అందిస్తామని ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం కాకుండా బీసీ బంధు ద్వారా రూ.10లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయాలని వైఎస్సార్ టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గణేష్‌నగర్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ దళితబంధు తరహాలో బీసీలకు బీసీ బంధు అమలు చేయాలన్నారు. కాగా, ఈనెల11న జరగనున్న గ్రూప్–1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

చేప మందును నిషేధించాలి

ఖమ్మంసహకారనగర్: అస్తమా(ఉబ్బసం) నయమవుతుందని అందించే చేప ప్రసాదంలో ఎలాంటి వ్యాధి నివారణ లక్షణాలు లేనందున నిషేధించాలని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శివన్నారాయణ, కె.రామారావు కోరారు. ఖమ్మంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చేప మందుతో ఉబ్బసం తగ్గకపోగా, కొత్త ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈసమావేశంలో రాములమ్మ, నాగేశ్వరరావు, రాఘవయ్య, మోహన్, శ్రీరాములు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు వరి సాగు శ్రేయస్కరం



మాట్లాడుతున్న సర్పంచ్ రాధాకృష్ణ

నేలకొండపల్లి: ముందస్తు వరి సాగు రైతులకు శ్రేయస్కరమని కొత్తకొత్తూరు సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరులో గురువారం ముందస్తు వరి సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు ముందస్తుగా వరి వేసుకోవాలని, ప్రభుత్వం అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి దుర్గభవాని, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసేలా మద్దతు ధరలు



మాట్లాడుతున్న ఆవుల వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం 2023–24 ఖరీఫ్ సీజన్‌కు కనీస మద్దతు ధర ప్రకటించకుండా రైతులను మరోసారి మోసం చేసిందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఖమ్మం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో జరిగిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఏఐపీకేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.అలాగే, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మించిన ప్రధాని మోదీ రైతుల అప్పులను రెట్టింపు చేశాడన్నారు.ధరల నిర్ణయంలో శాస్త్రీయత లేదని వరికి రూ.5 వేలు, పత్తికి రూ.16 వేలు, అదేస్థాయిలో మిగతా పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత నీటిపారుదల, ఎరువుల ధరలు పెరిగడంతో పెంచిన ధరలు ఏమాత్రం సరిపోవన్నారు. అలాగే కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కేశోత్ లక్ష్మణ్, డివిజన్ నాయకులు మేకరామనాథం, ఏఐపీకేఎస్ నాయకులు ధరావత్ లక్ష్మణ్ జర్పుల దేవ్లా, గునగంటి వీరబాబు, కూరాకుల నర్సయ్య, కేశోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలన

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను గురువారం అదనపు సీపీ సుభాష్ చంద్రబోసు, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డిలు పరిశీలించారు. రేపు (శనివారం) నూతన భవనాన్ని మంత్రులు ప్రారంభించనున్న నేపథ్యాన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఎస్సై రవికి వారు పలు సూచనలు చేశారు.

మెప్మా ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు..

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం లకారం ట్యాంక్‌బండ్‌పై మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలను ఉత్సాహపరిచేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయని, విజేతలకు 13వ తేదీన భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, మెప్మా డీఎంఓ సుజాత, డీఈ స్వరూపరాణి, ఏఓ శ్రీదేవి, సీఓలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రచార వాహనాలు ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 11న కొత్తగూడెంలో జరగనున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు ప్రచార వాహనాలనుఖమ్మం సీపీఐ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం ప్రకాశం మైదానంలో 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ మొదలవుతుందని తెలిపారు.

చైర్మన్, సభ్యులను మార్చాకే పరీక్ష నిర్వహించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులుగా కొత్త వారిని నియమించాకే గ్రూప్–1 పరీక్ష నిర్వహించాలని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా గ్రంథాలయం వద్ద గురువారం నిరుద్యోగులు చేపట్టిన నిరసనకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రస్తుత కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన పరీక్షలపై విచారణ జరుగుతుండగా, పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు ఎంపీ నామా పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లి మాజీ సర్పంచ్ కడియాల శ్రీనివాసరావు అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఈ మేరకు ఎంపీ నామా నాగేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈక్రమంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట జిల్లా రైతు బంధు సమితి కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి



మండవ వెంకటేశ్వర్లు(ఫైల్)

కూసుమంచి: మండలంలోని రాజుపేటబజార్ గ్రామ సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు (48) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్నఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్యతో పాటు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు వెంకటేశ్వర్లు మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వర్తక సంఘం ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రత దృష్ట్యా నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం భవనం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్, క్యాన్వాసింగ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సోమ నరసింహారావు(జీవై నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, క్యాన్వాసింగ్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మిడి కిరణ్‌కుమార్, గాదె లక్ష్మీనారాయణ, సెంట్రల్ ఈసీ సభ్యులు కై లాసపు వేణుగోపాల్‌రావు, పాయల నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు



పోతురాజు స్తంభాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠా వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభయయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు బొడ్రాయికి జలాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేసి, నాభిశిలను ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్ దుర్గాజ్యోతి, గ్రామస్తులు చల్లా హరి, గంగరాజు, నాగిరెడ్డి, నాగేంద్రబాబు, కె.శ్రీనివాస్, డి.రామారావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువే ఊరికి ఆదరువు

ఘనంగా ఊరూరా చెరువుల పండుగ

ఊరికి చెరువే ఆదరువు అని సాటి చెప్పేందుకే ఊరూరా చెరువుల పండుగ నిర్వహిస్తోందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. గురువారం మండలాల్లోని చెరువుల వద్ద తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెరువుల పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, మత్స్యకారులు కలిసి బతుకమ్మ ఆటలాడుతూ.. మత్స్యకారుల వలలను ఊరేగింపుగా తీసుకెళ్లి కట్టలపై ఉన్న దేవతల వద్ద పూజలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. దీంతో ఊరంతా పండగ వాతావరణం నెలకొంది. కాగా, చెరువుల వద్ద ఏర్పాట్లను అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: ఊరేగింపుగా చెరువు వద్దకు వస్తున్న చింతగుర్తి వాసులు



ఖమ్మంరూరల్: కొండాపురంలో కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే కందాల, ఎంపీపీ బెల్లం ఉమ



కూసుమంచి: గట్టుసింగారం చెరువు వద్ద బతుకమ్మలతో గ్రామస్తులు



తిరుమలాయపాలెం: సుబ్లేడులో ర్యాలీగా వస్తున్న గ్రామస్తులు



నేలకొండపల్లి: బతుకమ్మలతో ర్యాలీ తీస్తూ ఇలా..



రఘునాథపాలెం: చిమ్మపుడిలో..



నేలకొండపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్